## క్లుప్తంగా

### మాలాధారణ భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**కోవెలకుంట్ల:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణ శివారులో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం మాలాధారణ భక్తులకు అన్నదానం చేశారు. కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప, శివ మాలాధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా కార్తీక మాసంలో పట్టణంలోని ఏడు కొప్పెర్ల బావి సమీపంలో ఉన్న శివాలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, సాయిబాబా ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు సతీష్‌శర్మ పాల్గొన్నారు.

### ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

**బేతంచెర్ల :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మధు శేఖర్, సీనియర్ నాయకులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం నుంచి కార్మికులు, ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ మారుతికి వినతి పత్రం అందజేశారు.

**డోన్ టౌన్ :** ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా నాయకులు రాజశేఖర్, పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు.

### మెరుగైన వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం అధికారి నజీనీన్

**బేతంచెర్ల:** గ్రామాల్లోని రోగులు, గర్భిణులు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం అధికారి నజీనీన్, ఎస్‌ఓ సుజాత అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు , ఎంఎల్‌హెచ్‌పీలతో వైద్యులు అబ్దుల్ అలీమ్, మౌనిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలన్నారు. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగామ్‌ను ప్రారంభించారు.

### ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు


ఉసేన్‌స్వామికి ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

**కోవెలకుంట్ల:** మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాకు చేరుకున్నారు. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**కోవెలకుంట్ల:** వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

### వాహనాల తనిఖీ



బస్సు రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ

**డోన్ రూరల్ :** పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం ఆర్‌డీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు, పర్మిట్, ఇన్సూరెన్స్ వంటివి లేని బస్సులను సీజ్ చేసి రూ.3,20,000 జరిమానా విధించామన్నారు. అలాగే కేరళకు చెందిన రెండు ఇన్నోవా వాహనాలు ఆర్‌బీఐ క్యాష్ కంటైనర్లకు సెక్యూరిటీగా కేరళ పోలీసులతో వెళ్తుండగా తనిఖీ చేసి.. ఆంధ్రప్రదేశ్‌కు రోడ్ ట్యాక్స్ కట్టకపోవడంతో రూ.28,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

# కరెంట్ వచ్చేనా.. నీరు పారేనా?

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం
- కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వని వైనం
- రైతులకు తప్పని ఎదురు చూపులు


33/11కేవి సబ్ స్టేషన్ ఇల్లూరుకొత్తపేట

**బనగానపల్లె రూరల్:** సాగునీటి వనరులు లేని ప్రాంతాల్లో వ్యవసాయానికి పంపుసెట్లే ఆధారం. అయితే ఇందుకు విద్యుత్ కనెక్షన్ అవసరం. రైతుల అవసరాన్ని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు కనెక్షన్లు మంజూరు చేసేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా ఇప్పటి వరకూ ఒక్క వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కూడా మంజూరు చేయలేదు. దీంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

**370 మంది రైతులు దరఖాస్తు**

బనగానపల్లె డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి కొత్త వ్యవసాయ కనెక్షన్ల కోసం సుమారు 370 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఐదునెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఇందులో ఒక్క కనెక్షన్ కూడా మంజూరు చేయలేదు. దీంతో దరఖాస్తు చేసుకున్నవారి పరిస్థితి పరిస్థితి అగమ్యగోచరంగా మరింది. కండక్టర్స్, కెబుల్స్ తదితర మెటీరియల్ అందుబాటులో లేకపోవడంతోనే కొత్త కనెక్షన్ల మంజూరు జాప్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

**గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌లకు సంబంధించిన మెటీరియల్ ఎల్లప్పుడు అధికారులకు అందుబాటులో ఉండేది. ప్రతి నెలా సంబంధిత కోటా ప్రకారం ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ సీనియర్టీ ప్రకారం కనెక్షన్లు మంజూరు చేసేది. దీంతో రైతులకు ఇబ్బందిగా ఉండేది కాదు.

**త్వరలోనే మెటీరియల్ వస్తుంది**



త్వరలోనే మెటీరియల్ వస్తుంది. మెటీరియల్ రాగానే కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తాం. మెటీరియల్ అందుబాటులో లేకపోవడంతోనే జాప్యం జరుగుతోంది.

– మద్దిలేటి, డీఈఈ బనగానపల్లె సబ్ డివిజన్

ప్రస్తుతం తగినంత మెటీరియల్‌ను ప్రభుత్వం సరఫరా చేయక పోవడంతో వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అన్నదాతలు ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైంది. రైతులకు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. దీంతో విద్యుత్ పంపుసెట్లపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మెటీరియల్ సరఫరా చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

## మద్దిలేటిస్వామి ఆలయ సరిహద్దుల పరిశీలన


ఆలయ సరిహద్దులను పరిశీలిస్తున్న అధికారులు

**బేతంచెర్ల :** మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఆలయ సరిహద్దులను గురువారం పరిశీలించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లోని భూమి హద్దులను గుర్తించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అంబాపురం, రంగాపురం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఉదయం 8గంటల నుంచి శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు.

## చదువుకోవడం బాలల హక్కు


నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి తంగమణి

**డోన్ టౌన్ :** చదువు కోవడం బాలలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్, శ్రీసుధ హైస్కూల్, నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూల్లో జరిగిన కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రామనర్సప్ప, మాణిక్యం శెట్టి, చంద్రుడు, లోక్‌నాథ్‌రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.అలాగే పాతపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పద్మావతి, వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించుకున్నారు.

**డోన్:** స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. గోసానిపల్లె ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**డోన్ రూరల్ :** పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో మహిళా నాయకురాలు షమీంబేగం 50 మంది పిల్లలకు పలక, నోట్ పుస్తకాలు అందించారు.

**ప్యాపిలి:** హుసేనాపురం ఉన్నత పాఠశాలలో హుసేనాపురం పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా కొత్తగా నెహ్రూ విగ్రహం ఏర్పాటు చేయనున్న ప్రదేశంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్సై మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్యాంసన్, బాబా సాహెబ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

**బేతంచెర్ల :** మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం మద్దిలేటి రెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ధరణి టౌన్ షిప్‌లోని జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం అబ్రహం ఆధ్వర్యంలో, హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు, వలీబాషా ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కార్యదర్శి మధు మోహన్ రెడ్డి పిల్లలతో మొక్కలు నాటించారు.

**సంజామల:** ముక్కమల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌ఐ రమణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బాలల దినోత్సవం సందేశం ఇచ్చారు. అనంతరం బహుమతులను అందజేశారు.

**కొలిమిగుండ్ల:** మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ హెచ్‌ఓడీ రామబోగి, ప్రతినిధులు ఓంకార్‌దాస్, వంశీకృష్ణ, శ్రీనివాసులు బహుమతులు అందజేశారు.

**బనగానపల్లె రూరల్:** మండలంలోని కొండపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ రామగోవిందయ్య సొంత నిధులతో ఖోఖో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.

## ఎరువుగా 74 వేల మెట్రిక్ టన్నుల చెత్త


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్లు

**డోన్ :** స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా డోన్ మున్సిపల్ పరిధిలో 74వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ ద్వారా ఎరువుగా మార్చడం జరుగుతోందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. గురువారం స్థానిక డంపింగ్ యార్డును సందర్శించి ప్రాసెసింగ్ ద్వారా బయటకు తీసిన ఎరువును టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపారు. పోర్టు వచ్చిన తర్వాత ఈ ఎరువును పంట పొలాల్లో వినియోగించుకునేందుకు రైతులకు విక్రయిస్తామన్నారు. గత 40 సంవత్సరాలుగా పేరుకుపోయిన 74వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసేందుకు సుమారు రూ.5.34కోట్లు వెచ్చించామన్నారు. ఇందులో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 33 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 17 శాతం డోన్ మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా భరిస్తున్నారు. చైర్మన్ వెంట డీఈ రఘు, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్ తదితరులు ఉన్నారు.

### రోడ్డు విస్తరణకు చర్యలు

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని విస్తరించేందుకు ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం సర్పంచ్ శివ రాముడు, ఆర్‌డబ్లూఎస్ ఏఈ సాయికృష్ణ, విద్యుత్ సిబ్బందితో కలిసి రోడ్డు విస్తరణకు సంబంధించి కొలతలు వేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు, గ్రామ పంచాయతీ తాగునీటి పైపులైన్, అవుకు రిజర్వాయర్ నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ ఉండటంతో వాటిని మార్పు చేయాలని సూచించారు.

### బహుమతుల ప్రదానం

**డోన్ టౌన్ :** స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద చికాగో నగరంలో ఇచ్చిన ప్రసంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకులు మలిశెట్టి జగన్‌మోహన్, అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

### భగవద్గీత గ్రంథాల పంపిణీ

**కోవెలకుంట్ల:** పట్టణంలోని సప్తగిరి పాఠశాలలో గురువారం విద్యార్థులకు సమర సత్యసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు సరఫరా చేసిన భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకుడు విద్యాధర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధ్యాత్మికత, మంచి చెడుల గురించి తెలియజేసేలా 470 మందికి భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

**బేతంచెర్ల :** దేవాలయాల పరిరక్షణ కోసం 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అమ్మవారిశాలలో కరపత్రాలను మండల నాయకులు రామ్మూర్తి, హరి, అజయ్, హిందూ ధార్మిక సంఘాల సభ్యులు హుసేన్‌రెడ్డి, నాగమోహన్, బాలీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో గూని నాగరాజు, మురళీకృష్ణ, పుల్లారెడ్డి, మధు మోహన్ రెడ్డి, రవి, మాణిక్యం పాల్గొన్నారు.

### మధుమేహం పట్ల అప్రమత్తంగా ఉండాలి

**కోవెలకుంట్ల:** మధుమేహం (షుగర్) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ డయాబెటీస్ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ తీగల చోరీ

**కొలిమిగుండ్ల:** స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఉన్న తోటల్లో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ తీగలను చోరీ చేశారు. గ్రామానికి చెందిన రైతులు పల్లె రఘునాథరెడ్డి, మద్దిలేటి, చలపతి చీని, మామిడి, అరటి తోటలను సాగు చేశారు. ఉదయం తోటల వద్దకు వెళ్లి చూసే సరికి మోటార్ల వద్ద విద్యుత్ తీగలు కట్ చేసినట్లు గుర్తించారు. మొత్తం 170 మీటర్ల మేర తీగ చోరీకి గురైంది. దుండగులు తోట సమీపంలోనే నిప్పు పెట్టి వైరును కాల్చి కాపర్‌ను బయటికి తీసి తీసుకెళ్లిపోయారు. ఘటనపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### నాటుసారా పట్టివేత


పట్టుబడిన నాటుసారాను చూపుతున్న సీఐ వరలక్ష్మి, సిబ్బంది

**డోన్ రూరల్ :** నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామంలో దాడులు నిర్వహించగా బండి నాగలక్ష్మి, బండి ప్రమీలమ్మ సారా అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌బాషా, హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మి, నారాయణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

**కోవెలకుంట్ల:** మండలంలోని కంపమల్లకు చెందిన ఓ వ్యక్తి నుంచి గురువారం పోలీసులు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పుల్లారెడ్డి కోవెలకుంట్ల నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి బెల్ట్‌షాపుద్వారా విక్రయించేందుకు తీసుకెళుతున్నాడు. అందిన సమాచారం మేరకు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

**కోవెలకుంట్ల:** స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ సీఐ తకీబాషా తెలిపారు. మండలంలోని కలుగొట్లకు చెందిన బలరాం నుంచి 17 బాటిళ్లు, గుళ్లదూర్తికి చెందిన శ్రీనివాసులు నుంచి 15, దొర్నిపాడు మండలంలో గుండుపాపలకు చెందిన సుబ్బరాయుడు వద్ద 16 మద్యం బాటిళ్లు సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

### కేసు నమోదు

**డోన్ టౌన్:** ఈ నెల 11వ తేదీ రైల్వే ఉద్యోగి విజయకృష్ణపై దాడి చేసిన ఘటనలో గౌస్, హుస్సేన్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా గురువారం తెలిపారు. బాధితుడు విజయకృష్ణ గత సోమవారం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో గౌస్, హుస్సేన్‌లు దాడి చేశారన్నారు. రైల్వే ఎన్నికలకు సంబంధించిన విషయంలో తనపై కోపం పెంచుకొని కొందరి ప్రోద్బలంతో వారు ఈ దాడికి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

### సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**డోన్ రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ నాయకులు అన్వర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాతబస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. ఈనెల16న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వెంకటేష్‌గౌడ్, పెద్దనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సభ్యులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ వరప్రసాదరావు

**కోవెలకుంట్ల:** గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరప్రసాదరావు సూచించారు. స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఓలు, వెలుగు ఏపీఎం, ఉపాధి పథక ఏపీఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామైక్య సంఘ అధ్యక్షురాలు, గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి, తదితర అంశాలను ఎంపీడీఓ సభ్యులకు వివరించారు. ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య, వెలుగు ఏపీఎం శేఖర్, పీహెచ్‌సీ డాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బనగానపల్లె రూరల్:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని పొదుపు భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర పభుత్వ పథకాలు, గ్రామ పంచాయతీల నిధులు, మహిళా సంఘాల జీవనోపాధి, ఉపాధిహామీ పథకం లేబర్ బడ్జెట్ తదితర వాటి గురించి వివరించారు. ఎంపీపీ మానసవీణ, పీఆర్ ఏఈ రమణ, ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు


బేతంచెర్లలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయ అధికారి, పాఠకులు

**బేతంచెర్ల :** గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు మాజీ ప్రధాన మంత్రి నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకతను, దేశ నాయకులు గురించి వివరించారు.

**బనగానపల్లె రూరల్:** బనగానపల్లె గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి బషీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. మంత్రి సతీమణి ఇందిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ సమస్యలపై లైబ్రేరియన్ ఆమెకు వినతి పత్రం అందజేశారు.

**అవుకు:** మండల కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈఓఆర్‌డీ శ్రీనివాసులు, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ హరిప్రసాద్, గ్రంథాలయ ఇన్‌చార్జ్ రామదాసు తదితరులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు కుమారి, పాఠకులు, పాల్గొన్నారు.

**సంజామల:** గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని మండల గ్రంథాలయ అధికారి తిమ్మారెడ్డి అన్నారు. సంజామల గ్రంథాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం సురేష్ రెడ్డి, తెలుగు పండిత్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**కోవెలకుంట్ల:** అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు మహమ్మద్ రఫీ, సతీష్‌కుమార్, కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే అవుకు మండలంలో తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ వెంగన్నకు వినతి పత్రం అందించారు. ఈఎంటీలు జనార్దన్ రెడ్డి, పుల్లయ్య, చంద్రనాయక్, పైలట్లు రాముడు, వెంకటేశ్వర్లు, ఎం.రాముడు పాల్గొన్నారు.

### ఆరోగ్య సర్వే

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని సచివాలయం –5 పరిధిలోని కాలనీల్లో వైద్యసిబ్బంది ఆరోగ్య సర్వే చేపట్టారు. టంగుటూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సర్వేను పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

**అవుకు:** ఆరోగ్య సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. గురువారం అవుకులో వైద్య సిబ్బంది చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు.

## రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించండి


ల్యాండ్ కన్వర్షన్ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ నరసింహులు

**కోవెలకుంట్ల:** రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని డోన్ ఆర్డీఓ నరసింహులు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మండలంలోని వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటికి పరిష్కారం చూపాలన్నారు. ఏపీ సేవ, రీసర్వే భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై చొరవ చూపి రైతులకు సత్వర సేవలందించాలన్నారు. అనంతరం మండలంలోని గుళ్లదూర్తి గ్రామ సమీపంలో ల్యాండ్ కన్వర్షన్ భూములను పరిశీలించారు. మండల సర్వేయర్ వీరన్న, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ప్యాపిలి:** వైద్య సిబ్బంది నిర్వహించే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు వారంలో ఐదు రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిరోజూ 5 ఇళ్లను సందర్శించి క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తారన్నారు. మహిళల్లో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, పురుషుల్లో నోటి క్యాన్సర్ వస్తుందన్నారు. ప్రారంభదశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స ద్వారా ఈ వ్యాధిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాదేవి, సుభాను, ధరణి, శ్రీనివాసరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ హెచ్‌ఎంకు సత్కారం


సురేష్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

**డోన్ టౌన్ :** రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పట్టణంలోని నెహ్రూనగర్ హైస్కూల్ హెచ్‌ఎం తొగట సురేష్‌బాబును గురువారం ఘనంగా సత్కరించారు. ఆయన ఈ నెల 11వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దీంతో పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్లో సురేష్ బాబును ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటలక్ష్మి, అల్లిపీరా, రాధ, రఘునాథ్, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### వెంకటరామిరెడ్డిది ప్రభుత్వ హత్యే

**డోన్ టౌన్ :** మండలంలోని కొత్తబురుజు గ్రామ వీఓఏ వెంకటరామిరెడ్డి కూటమి నేతల రాజకీయ వేధింపులకు ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందాడని, ఇది ప్రభుత్వ హత్య అని సీఐటీయు జిల్లా కార్యదర్శి శివరామ్ అన్నారు. మృతుని కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం గ్రామానికి వీఓఏల సంఘం అధ్యక్షకార్యదర్శులు మధుసూదననాయుడు, లక్ష్మణ్, కోశాధికారి గుండాలయ్యగౌడ్‌తో పాటు 30మంది వీఓఏలతో కలిసి వెళ్లి భౌతికగాయంపై పుష్పా గుచ్చాలు ఉంచి నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అతని మృతికి కారణమైన వెలుగు ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### కూటమి ప్రభుత్వం నమ్మకాన్ని వమ్ముచేసింది

**డోన్ టౌన్ :** కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తుందన్న నమ్మకాన్ని వమ్ము చేసిందని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతిప్రియ, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ లతీఫ్ అన్నారు. గురువారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 9.8శాతం కేటాయించిందని, ఇది గతంతో పోల్చితే చాల తక్కువ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలన్న కొఠారి కమిషన్ సిఫార్సులకు దరిదాపులో కూడా లేదన్నారు. రమేష్ నాయుడు, ఆంజనేయప్రసాద్, మధు, బొజ్జన్న పాల్గొన్నారు.